# జయలక్ష్మి

కావిలిపాటి విజయలక్ష్మి



ఎక్కడనుంచో ట్రంకాల్. రిసీవర్ చేతిలోకి తీసుకుంది జయలక్ష్మి. ప్రతి ఐదు నిమిషాలకి అలా ఎక్కడ నుంచో వస్తూనే ఉంటుంది. తనకు మంచి నీళ్లు తాగటానికి ఆ కుర్చీలోంచి లేవటానికి కూడా టైము దొరకదు. అదొక పెద్ద హోటలు, ఆ హోటల్లో జయలక్ష్మి ఫోను క్లర్కు. ఉదయం కాఫీ టిఫిను, మధ్యాహ్నం కాఫీ టిఫిను, రెండు వందల రూపాయలతో జీతం. కాని ఉద్యోగం చెయ్యాలా? ఆమె పెదవులపై ఉదాసీనమైన నవ్వు కదిలింది.

జీతం రాగానే తన దగ్గర రెండు వందలూ తీసుకుని పాకెట్ మనీ అని తన చేతిలో యాభై రూపాయలు పెట్టే జగ్గారావు కనుల ముందు మెదిలాడు. ఆమె కనుల్లో కసి కోపం దుఃఖం విప్పారుతూ అన్ని కదిలాయొసారి.

మళ్ళీఫోను వచ్చింది. విసుగ్గా రిసీవరు చేతిలోకి తీసుకుంది జయలక్ష్మి. ఉదయం ఆరుగంటల నుండి పదిగంటల వరకు, మళ్ళీ మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం ఆరువరకు ఆ కుర్చీలో ఉండాల్సిందే. ఆ కుర్చీ చూస్తేనే జయలక్ష్మికి కోపం.

తెల్లవారు జాము నాలుగున్నర అయ్యేసరికి జగ్గారావు ఆమెను తట్టి పిలుస్తాడు. జయా! లేలే అని. తను అలాటి టైములో అమ్మ వాళ్ళ ఇంట్లో ఉన్నప్పుడుహాయిగా పడుకునేది ఉదయం ఏడుగంటల వరకు అసలు మెలకువ వచ్చినా మంచం మీదినుంచి లేచేది కాదు. జయ ఇంకాలేవలేదు అని అన్నయ్య విసుక్కుంటే పోనీరా! అది ఇప్పుడు లేచి ఏం చెయ్యాలి అనేది అమ్మ.

దానికి ముద్దు చేసేస్తున్నావ్ అనేవాడు అన్నయ్య. నిజమే తను ఒక్క ఆడపిల్ల కావటాన్న అమ్మ తననుముద్దుగా ప్రేమగా పెంచింది. తనచేత కనీసం ఎప్పుడూ కాఫీ అయినా కలిపించలేదు. తల్లి గుర్తు వచ్చి కనుల్లో నీరుతిరిగింది జయలక్ష్మికి.

అమ్మా! నన్నుఆ హృదయం లేని పాషాణానికి డబ్బుమనిషికి ఎందుకిచ్చి పెళ్ళిచేశావమ్మా! ఆక్రోశించింది ఆమె హృదయం.

హాయిగా కాలేజిలో ఇంటరు చదివే రోజుల్లో, తనకు పెళ్ళి చేసెయ్యాలనే ఆలోచన వచ్చింది అమ్మకి. దానికి కారణం తనకు పెద్ద వయసు లేకపోయినా నాన్నగారి అనారోగ్యం. అతను ఉండగా తనకు పెళ్ళిఅయిపోవాలని, అల్లుడునట్టింట తిరగాలని, ఇంకా మనుమల్ని ఎత్తుకోవాలని ఎంత పిచ్చి కోరిక! ఎంత అమాయకమైన ఆశ! అల్లుడు! పదివేల రూపాయలలో కొన్న పశువు. తనమీదా తన తన వారి మీదా అజమాయిషీ చేసి అలిగే బుద్ధిహీనుడు. అతని తల్లి ఒక పాతకాలపు మనిషి. ఆమెకు కోడలంటే తమ ఇంటి దాసి, తమ చెప్పు చేతుల్లో తిరగాల్సిన నోరులేని జీవం. ఆ తల్లి అతనికి దైవం. ఆమె అతన్నిఎంతో ప్రేమగా పెంచింది. అందుకు కృతజ్ఞతగా అతను తల్లిని ఏమీ అనడు. ఆమె కోడల్ని అలగాజాతి స్త్రీలా తిట్టినా బుగ్గలు పొడిచినా తను సహించాలి. ఆమెకు జవాబివ్వకూడదు. మీ అమ్మ అని తను ఏమో చెప్పబోయేంతలో అతను నోరుముయ్ అని కసురుకుంటాడు. ఇంటిపని "ఉద్యోగం రెండూ నేను చెయ్యలేను. ఏదో ఒకటే చేస్తాను మీఅమ్మసేవ." అని తన నోటినుంచి వచ్చిందో లేదో తన చెంప ఛెళ్లుమంది. అతను కొడితేతనెందుకు నోరుమూసుకుపడుండాలి: తను ఇంటర్మీడియట్ పాసయ్యింది. అతనూ అంతే చదివాడు. అతను రైల్వేలో గుమస్తాగా చేస్తున్నాడు. వేలు సంపాయించి తన

సుఖపెట్టడంలేదు. చాలీ చాలని జీతం అని తనను ఉద్యోగంలోచేర్చాడు. ఇంటిమంచి వంటబియ్యం పప్పులూ అన్నీ వస్తాయి. తిండికి లోటులేదు. అయినా తను ఈ ఉద్యోగం చేసి రెండువందల రూపాయలు నెలకు సంపాయించాలని అతని పట్టుదల. ఇంకాతనమీద తనవాళ్ళ మీద ఏదోకసి, తనవాళ్ళెవరినీ తన ఇంటికి రావద్దన్నాడు, పెళ్లి మాటల సందర్భంలో తను అవసరమయితే ఉద్యోగం చేస్తుందని ఒకామె, ఒక్కపిల్లకనుకము సమచ్చటలు చూస్తారని ఒకామె అతనికి ప్రామిస్ చేశారట. తనతల్లితండ్రులు ఇచ్చే కట్నం కానుకలు అతనికి స్వల్పమైనవిగా కనుపిస్తున్నాయి. అతని ఆశకు అంతం లేదు.

మళ్ళీ ఫోను మ్రోగింది. ఆమె ఆలోచనలు చెదరి పోయాయి- రిసీవరు చేతిలోకి తీసుకుంది. కడుపులో తిప్పి వాంతి అవుతుందేమో అని అనుమానం

రిసీవరు వదిలేసి లేచినిలబడింది. ఎందుకన్నట్లు తన ఎదర కుర్చీలో కూర్చున్న పొప్రయిటరు చుట్టం ఆమె వైపు చిరాగ్గా చూశాడు.

—"ఒక్కసారి అవతలికి వెళ్లి రావాలిదయ చేసి" అని అతని ముఖంలోకి చూసి వెంటనే చూపు మరల్చుకుంది జయలక్ష్మి.

"ఊ తొందరగా వచ్చెయ్యండి" అన్నాడతను.

అవతలికి వెళ్ళి వాంతిచేసుకుని ముఖం కడుక్కొని చేతిరుమాలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చి మళ్ళీ ఆమె సీటులో కూర్చుంది.

"మీరీఉద్యోగం మానేస్తే బాగుంటుంది" అన్నాడతను.

మాట్లాడలేదు జయలక్ష్మి. ఫోను గలగల మ్రోగడంతో రిసీవరు చేతిలోకి తీసుకుంది.

"అడుగడుగునా మీ బంధువులు హోటలుకి వచ్చి మీతో మాట్లాడాలనుకోవటం ఏమీ బాగా లేదు." అతనన్నాడు.

ఆమాట జయలక్ష్మి రెండవ చెవికి వినిపించింది.

తన భర్త బంధువుల్ని ఇంటికి రావద్దనటంలో ఆమె పనిచేసే హోటలుకి వస్తారు. వద్దన్నాక తనతో మాట్లాడ వద్దన్నాక ఎవరు వస్తారు? మామయ్య వస్తుంటాడు అప్పుడప్పుడు పట్నంలో పనిఉండి వచ్చినప్పుడు. ఎప్పుడన్నా అన్నయ్య ఫ్రెండ్ అనిల్ వస్తూంటాడు దొడ్డపిన్ని కలసిరెండు మూడు సార్లు తనను చూడాలని కలవరపడ్డే తన తలితండ్రులకు తన గురించి ఉత్తరం వ్రాస్తామంటూ వచ్చారు. ఈ ప్రొప్రయిటరు బంధువు వెంకట్రావు ఎప్పుడూ హోటలుకి వచ్చిపోయ్యే వాళ్ళ వైపు పాడుచూపులు చూస్తూ కూర్చుంటాడు తనకు నాలుగు అడుగుల దూరంలో ఉన్న కుర్చీమీద.

అప్పుడు వచ్చిన వాళ్లని డ్యూటీ టైములో మీరిలా అమ్మాయిని డిస్టర్బ్ చెయ్యకూడదనిఅంటూంటాడు. జయలక్ష్మి అని తన వేపు కనుబొమలు చేసి చూస్తుంటాడు.

అవతల నాలుగవఫ్లోర్ తొమ్మిదో నెంబరు రూమ్ నుంచి వచ్చిన ఫోను మెసేజికి అన్యమనస్కంగానే జవాబిస్తూ ఫోను పెట్టేస్తూ- వెంకట్రావుగారూ ఎవరు వచ్చారు మామయ్యనా. అడిగింది నమ్రతగా జయలక్ష్మి.

"ఏమో వాడు మీకు మామే అవుతాడో బావే అవుతాడో నాకేం తెలుసు వచ్చి మిమ్మల్ని అడిగాడు మీరు ఇప్పుడుడ్యూటీకి రాలేదని చెప్పాను" అన్నాడు వెంట్రావు.

అలా ఎందుకు చెప్తారు? తనకు ఇతనెందుకిలా శత్రువయి పోతున్నాడు? అనుకుంటూ అడిగింది జయలక్ష్మి.

"ఎందుకా." అని వికటంగానవ్వి "బంధువులయితే మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కలియాలండీ. కాని హోటలుకి వచ్చి మంతనాలేమిటి? మేం పర్మిషనివ్వం అలా మాటాడటానికి ఎటునుంచి ఏం వచ్చినా మాకొంపలు మునుగుతాయి." విసురుగా అన్నాడతను.

తన తండ్రి ఆరోగ్యం సరిగా లేదని తన పుట్టిన ఊరు నుంచి వచ్చినావిడ ఓసారి బజార్లో కనుపించి చెప్పింది అతని ఆరోగ్యం గురించి మామయ్యకు తెలుస్తుంది. ఏమన్నా చెప్పాలని వచ్చాడేమో. తన బంధువులు ఎందుకు తమ ఇంటికి రారో వెంకట్రావుకి చెప్పెయ్యాలనుకుంది కాని తన భర్త అటువంటి వాడని అతనితో చెప్పటం అతనిదృష్టిలో తను తేలికవటం ఆమెకు నచ్చలేదు. "మాయిల్లు దూరం ఈ ఊరు వచ్చి మళ్ళీ వెంటనే వెళ్లిపోయే బంధువులకు నన్ను కలుసుకోవటం కష్టం. అందుకని హోటలుకి రమ్మని చెప్పాను. అయినా పగలంతా ఈ హోటల్లో పడి ఏడుస్తున్నాను కదా. వాళ్లి నాతో మాటాడేదెపుడు?" చురుగ్గా అతని వేపు చూస్తూ ప్రశ్నించింది జయలక్ష్మి.

"హోటల్లో పడి ఏడవ్వద్దు జయలక్ష్మి. మీ ఇంట్లోనే ఏడవండీ, ఇప్పుడే ఓరిజైన్ కాయితం వ్రాసి ఇవ్వండీ- వెళ్లి పోండి. మాకేం అభ్యంతరం లేదు." అన్నాడతను వెటకారంగా అతనే ఓనరయినట్లు.

"రిజైను కాయితంఇవ్వాల్సివస్తే ఇచ్చేవాళ్ళకే ఇస్తాను. మీకెందుకిస్తాను." అని విసురుగా అనేసి మళ్లీ రిసీవరుచేతిలోకి తీసుకుంది జయలక్ష్మి.

అతనామె వేపు చురచురచూశాడు.

సాయంత్రం ఆరుగంటలయింది. ఏదో ఆలోచనలో ఉన్న జయలక్ష్మి కమలవచ్చి 'గుడీవినింగ్ జయలక్ష్మి' అనేవరకు కుర్చీలోంచి లేవలేదు. ఆ గుడీవినింగ్ అంటు లేచి పవిట సర్దు కుంటూ భుజాన సంచీ తగిలించుకుని రోడ్డువైపు నడిచింది జయలక్ష్మి.

కార్లు, ఆటోలు, రిక్షాలు, సిటీబస్సులు. రోడ్డు రద్దీగాఉంది. కారుచీకట్లుకమ్ముతున్నాయి. ఇంటికి తోవ ఎటూ తెలియడం లేదు. ఉదయం బస్సులుంటాయి. కనుక బస్సులో వెళ్ళమని, టైముందంటే నడిచే వెళ్లమని అంటాడేకాని, రిక్షాలో వెళ్లు అనడు ఇగ్గరావు. సాయంత్రమయితే అలా షికారుగా నడిచి రావచ్చు. అంటాడు. అతని ప్రాణానికి, డబ్బే లంకె. కట్నంకాక, ఆటోమెటిక్ వాచీ. స్కూటరూ, బీర్వా, గేస్ పొయ్యూ. సోఫా సెట్, ఒక్కొక్కపండక్కి ఒక్కొకటి కోరెయ్యాలనుకున్నాడు. స్నాతకం దగ్గర కాశీ ప్రయాణానికి బూటు ఇవ్వమని పెళ్లికొడుకు నిల్చుండిపోతే, ముక్కుమీద వేలేసుకున్నారు. మర్యాద తెలిసిన మనుషులు? కక్కుర్తి మనిషి అని అసహ్యించుకున్నారు పెద్దలు. "అబ్బాయికి చెప్పవద్దా. ఇప్పుడు బూటు అతను అడగకూడదు. వారు ఇవ్వకూడదు." అన్నారెవరో పెళ్లికొడుకు తండ్రితో.

"వాడు కావాలంటూంటే అడగద్దని ఎలా అనమంటారండి. ఇప్పుడు, వారు ఇవ్వటం లేదుగా. వాగ్దానం చెయ్యమనండి



అమ్మా తల్లినో, తండ్రినో, తర్వాత అడుక్కుంటాడు" అన్నాడతను. పూర్తిగా బట్ట విడిచేసినట్లు సిగ్గు లేకుండా.

"అలాగే ఇస్తారు పదవయ్యా తంతు జరగనీ" అందొక పెద్ద ముత్తైదువ విసుగ్గా.

మీరుకారు ఆమెనుచెప్పమనండా మాట." అన్నాడు పెళ్ళికొడుకు కనుసైగజేసి, ఆమెను మింగేసేట్టుచూస్తూ.

అయ్యబాబోయ్. ఇదేం మనిషిరా బాబూ. బొత్తిగా సంసారం లేనిమనిషిలా ఉన్నాడు అనుకుంటూ, అక్కడనుంచి తప్పుకుందామె.

ఆ సాయంత్రమే అతనికి బావమరిది బూట్లు కొనితెచ్చాడు. బూట్లతో ప్రారంభమయింది అల్లుడి ఆగడం. పండక్కివెళ్ళి ఆటోమెటిక్ వాచీ కావాలని, కపోతే భోజనం చెయ్యనని, అలిగాడు. జయలక్ష్మి తండ్రికి కళ్లు నీళ్ల పర్యంతమయింది అప్పుదొరక్క.

తర్వాత భార్య ఉద్యోగం చెయ్యాలనే పట్టుదలముందు. ఓ ఖరీదయిన హోటల్లో ఫోనుక్లర్కుగా మూడువందల రూపాయల జీతానికి, భార్యని బలవంతాన ఉద్యోగంలో చేర్చాడు. ఆ హోటల్లో వ్యభిచారం స్వేచ్ఛగా సాగిపోవటం గమనించిన జయలక్ష్మి తానా హోటల్లో పనిచెయ్యనని మొండికేసింది. చెయ్యి చేసుకున్నాడు జగ్గారావు. అయినా ఆమె లొంగలేదు. నన్ను పోషించలేనివాడివి పెళ్ళెందుకు చేసుకున్నావని ప్రశ్నించింది. ఫలితం అతను మరింత కర్కశంగా ఆమెమీద చెయ్యి చేసుకున్నాడు. పెళ్లికి ముందు నువ్వు ఉద్యోగం చేస్తావని మీవాళ్లన్నారు. అందుకే పెళ్లి చేసుకున్నాను నిన్ను అన్నాడు. బోడి సంబంధం, వెధవ సంబంధం. నన్ను మోసం చేశారు అన్నాడు. కసిగా జగ్గారావు.

అతనేమన్నా, కొట్టినా, తిట్టినా, ఆ హోటల్లో పనిచెయ్యటానికి తయారులేదు. జయలక్ష్మి.

తర్వాత ఈ హోటల్లో ఉద్యోగంలో పెట్టాడు. ఆమె అందులో సరిగా ఉద్యోగం చెయ్యాలి. అదీ అతని పట్టుదల.

వారం పదిరోజులుగా వొంట్లో బాగాలేదు. వారంరోజులు సెలవు తీసుకుందామంటే అస్సలు జగ్గారావే వొప్పుకోవడంలేదు.

ఇవ్వాళ ఎలా అయినా ఇంటికి వెళ్ళాక గట్టిగా అడిగేస్తుంది. లేకపోతే పుట్టింటికి లేచిపోతుంది. రోడ్డు వారనుంచి గబగబా నడక సాగించింది జయలక్ష్మి.

o o o

అవ్వాళ ఇంట్లో పెద్ద గొడవే అయ్యింది. ఇంతరాత్రయ్యాక వస్తె ఇంటి పని, వంటా, ఎవరు చేస్తారనుకున్నావు నాకు జ్వరంవచ్చింది అని గాలిదుమారంలా లేచింది అత్తగారు వంతపాడాడు జగ్గారావు.

నేను ఉద్యోగం చెయ్యనంది జయలక్ష్మి. అయితే మీవాళ్లింటికి వెళ్లిపో అన్నాడుజగ్గారావు.

మా వాళ్లు మీకిచ్చిన కట్నం, పెళ్లి ఖర్చులక్రింద అయిన ఏడువేలూ ఇచ్చేసి నెలనెలా జీతంలో రెండువందలు నాకు పంపిస్తానని కాయితంవ్రాసి ఇవ్వండి. వెళ్లిపోతాను అంది విజయలక్ష్మి.

ఎంత పొగరుందే నీకు. ఎన్నిమాటలు వచ్చే నీకు. అని ఆమెచెంప చెళ్ళుమనిపించాడు జగ్గారావు.

హవ్వ హవ్వ అని బుగ్గలు నొక్కుకుని తను అనాల్సిన నాలుగు మాటలూ అనేసి మంచమెక్కి ముసుగు తన్నేసింది అత్తగారు. అన్నం మాత్రం వండి నేను కూర చెయ్యలేనంది జయలక్ష్మి.

భార్యను తిట్టి, తల్లిమీద విసుక్కుని వీధి చివర దుకాణంలో పకోడీలు తెచ్చాడు జగ్గారావు. అది వాళ్ళకలవాటే అన్నం చారూ మాత్రం చేసుకుని పకోడీలు నంచుకుని అన్నం తినేస్తారు. జయలక్ష్మికి ఆ వంటల తీరు నయించవు. అయినా అలవాటుపడటానికి ప్రయత్నిస్తూంది.

మర్నాడు మేనమామకి తన ఇంటి సంగతులు వ్రాస్తూ నువ్వే వచ్చి ఉంటావు. హోటలుకి, నేను ఈ కాపురం చెయ్యలేకపోతున్నాను మామయ్యా. ఇల్లు నరకంగా ఉంది. రా పర్వాలేదు కాసేపు మాట్లాడి వెళ్దువుగాని అని వ్రాసింది.

తన బంధువులలో మాట్లాడటానికి, వెంకట్రావు ఏట్ల మంచిగా ప్రవర్తించవలసి వచ్చింది జయలక్ష్మికి. వెంకట్రావు ఆమెనెలా అర్థంచేసుకున్నాడో నెమ్మదిగా ఆమె వ్యక్తిగత విషయాలు ప్రశ్నించి తెలుసుకున్నాడు పుత్తము డిలా ఆమె బంధువులు వస్తె విసుక్కోవటం లేదు.

ఆమె వాళ్ళలో మాట్లాడుతూంటే ఫోనుదగ్గర కూర్చునేవాడు. అతనికి థాంక్సు ఎన్నిసార్లు చెప్పేదో జయలక్ష్మి.

జయలక్ష్మి ఆరోగ్యం కొంచెం కుదుటపడింది. ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళిపోతూన్న జయలక్ష్మిని, 'జయలక్ష్మీ' పిలిచాడు వెంకట్రావు.

ఆమె నవ్వుతూ, ఎందుకన్నట్లు అతని వైపు చూసింది.

"రూమ్‌కెళదాంరండి" కాస్సేపు మీతో మాట్లాడే పనుంది.అని వెకిలినవ్వు నవ్వాడు వెంకట్రావు'ఇక్కడేమాట్లాడండి'చీకటిపడిపోయింది. వెళ్లిపోవాలి రూమ్‌కి. రావటానికి వీలవదు అంది జయలక్ష్మి.

వీలవదూ! అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు వెంకట్రావు. ఎడంకాలి చెప్పుతో అతని చెంపచెళ్లుమనిపించింది జయలక్ష్మి.

కాని వెంకట్రావు పగబట్టాడు, జయలక్ష్మి జీవితంలో విషం కక్కాడు. ఆమె భర్తకు మీ భార్యకోసం ఎవరో హోటలుకి వస్తూంటారని చెప్పాడు. అస్సలే ఆ భార్య అంటే మోజులేని జగ్గారావు ఆమెను వదిలించుకోటానికి ఇది మార్గమనుకున్నాడు.

"మీవాళ్ళింటికి వెల్దాంరా. అని తీసుకు వెళ్లి పుట్టినింట్లో దిగవిడిచి వచ్చాడు. తీసుకు వెళ్ళేప్పుడు చాలామంచిగా నమ్మకంగా ప్రవర్తించాడు. నాలుగు రోజులు రెస్టుతీసుకుందువుగాని, ఉత్తరం వ్రాస్తాలే ఉద్యోగం చెయ్యనక్కరలేదు" అని అతనంటుంటే ఆశ్చర్యపోవడమే జయలక్ష్మి వింతయింది.

నెలా రెండునెలలూ గడిచాయి. భర్త దగ్గరనుంచి పిలుపు, ఉత్తరం లేకపోయేసరికి జయలక్ష్మి తల్లిదండ్రులకు అనుమానం తోచింది. ఆమెను అత్తవారింటికి తీసుకు వెళ్లారు. ఒట్లు, ప్రమాణంచేసి భర్తను బ్రతిమిలాడింది ఏడ్చింది, మొత్తుకుంది. అయినా జగ్గారావు మనసు కరగలేదు. సిగ్గు. సిగ్గు. పదమ్మా అన్నారామె తల్లిదండ్రులు. తర్వాత పెద్దలు మీకాపురం దిద్దుతామని వచ్చినా అంగీ కరించలేదు జయలక్ష్మి.''నేను ఏదో ఉద్యోగం సంపాయించి బ్రతుకుతాను" అని ఖచ్చితంగా చెప్పేసింది. తల్లి కంట తడిపెడితే "ఊరుకోమ్మా.నాలా విజయలక్ష్ములు చాలామంది ఉన్నారు."అని నవ్వేసింది పేలవంగా. ★